# పిల్లంగ్రోవి

## ౧

ఆ బాలకుని పిల్లంగ్రోవి పొలంగట్టులు, చేలు, కాలువలు, కొద్దిదూరాన ఉన్న కొండలు నిండుతూ ఉన్నది.

అతనికి రాగజ్ఞానంలేదు! అతడు స్వరవిద్య నేర్చుకోలేదు. అతని గురువులు కోకిల. తుమ్మెద, సెలయేరు ఆవుల అంభారవం చేలమీదనుంచి తేలిపోయే మలయబాలకుడు, ఉఱుము, కీచురాయి, లవంగిపిట్టలు.

అతనికి ఉన్న జ్ఞానమే గాంధర్వము. ఒకస్వరం ఇంకోస్వరం కుత్రి చూస్తాడు. అతని ఊపిరే లయ! ఆలయలోంచి వచ్చినతాళాలు మూడే, ఆది, ఏక, రూపకతాళాలు.

అతడుకల్పించిన గీతాపథకాలు విచిత్ర మూర్ఛనలు.

## ౨

గొడ్లకాపు కుఱ్ఱవాడు, తొమ్మిదేండ్ల ఈడువాడు. చలిదివన్నం గంజీ ఉప్పుచేప నంజుకుంటూ మెక్కి, ముంతలో గంజివన్నం పెట్టుకొని, ఉప్పులో ఊరవేసి ఎండపెట్టిన మామిడికాయబద్ద కంచమూ మూటకట్టుకొని గేదెపై స్వారి అవుతూ ఏటిగట్టుకు వస్తాడు.

అతని సింహాసనం వేపచెట్టునీడ, అతని ప్రజలు పశువులు. అతని ఆయుధం పిల్లంగ్రోవి !

ఆతని పట్టుపీతాంబరలు చినిగినగోచీ, చినిగిన తలపాకాగుడ్డ! వాన వస్తే రెండుగేదెల్ని నిలబెట్టి వాటి అడుగున కూచుంటాడు. ఏరు పొంగితే గేదెలమీద దాటుతాడు, ఆతని రక్షక భటులు ఆవులు గేదెలు. పెద్దపులి నైనా దూరాన నిలబెట్టుతాయి.

## 3

పశువులతో మేతబయలుకురాగానే ‘పొండఱా’ అని చెట్టుకింద మకాంవేస్తాడు. ఆటలు ఆడుతాడు, పాటలు పాడుతాడు.

పిల్లంగోవి తీసి భువనమోహనంగా వాయిస్తాడు. ఆ పాటలకు సాహిత్యం ఆతని హృదయమే !

ఒకసారి ఆతనిపాట ఎగిరి గంతులువేస్తుంది. పూవులు పూస్తుంది. చిరునువాసనలు వెదజల్లుతుంది. చిటి చిట్టి ఊటలా జల జల లాడుతుంది.

ఒకసారి ఆతనిపాట లోకాన్ని చూచి ఆశ్చర్యం పడుతుంది. తెల్లబోతుంది, వణుకుతుంది.

ఒకసారి ఆతనిగీతం ఏదో వెదుకుతుంది ఆకాశాన్ని పరికించి చూస్తుంది. భూమిలోతులు చొచ్చిపోతుంది. నదీ నీరాంబుకణాలు లెక్కబెడుతుంది.

మరి ఒకసారి కంటనీరు నింపుతుంది ఏదో ఎరగని భయంచే ముడుచుకుపోతుంది, ఆకలై కుషిక్కుస్తుంది, మానవుని సర్వబాధలై విలపిస్తుంది.

ఇంకొకసారి అన్నీ తెలిసిన జ్ఞానిపద్మంలా యోగము దీపవహిస్తుంది గడ్డిపూవుల నివేదనలిస్తుంది. ఏటిలోని చేపలులా లోతులు కనిబెట్టుతుంది.

ఆ బాలుకు పిల్లంగోవి పెదవులతో చుంబిస్తూ తన సృష్టితనకే తెలియని బాలుడౌతాడు.

౪

ఒకరోజు ఆ పక్క పొలంలోనుంచి పాలంకూలీ బాలిక ఒకతె ఆతని పాటదారినే ఆతన్ని వెతుక్కుంటూ వచ్చింది.

ఆ బాలిక ఎనిమిదేళ్ళబిడ్డ! ఆతనికి ఎదురుగా ఆతని పాటవింటూ కదలకుండా కూరుచుంది.

ఆమెవచ్చి ఆతని రాజ్యాన్ని హరించలేదు, భాగించలేదు.

ఆమె ఆతనిరాజ్యంలో, ఆతనిపాటలో, ఆతనిలో భాగమయింది.

ఆమెకూడా ప్రతిరోజూ ఆతడు పాటపాడేవేళకు వచ్చి ఆతని ఎదురుగుండా కూచునేది.

ఆ బాలికకు ఓ చింపిగుడ్డ మొలకు ఆగుడ్డ ఆమెనగ్నతను పూర్తిగా కప్పనేలేదు. ఆమె చేతికి రెండుగాజు గాజులు. ఆమెకాళ్ళకు రెండు అల్యూమినియం కడియాలు.

ఆ బాలునిమోము సూర్యబింబం అవుతే, ఆమె మోము ఆ పక్క చెరువులోని పద్మమే!

తెలుగు విశ్వవిద్యాలయ
గ్రంథాలయం
నమోదు సంఖ్య 42818
తేది 21/11/88



ఒకదినాన అతడు పిల్లంగ్రోవి వాయిస్తున్నాడు. లోకం అంతా సమ్మోహనమై అతని పాటవింటోంది. ఆబాలిక అపాటేఅయింది.

ఇంతలో లోకాలు బద్దలుచేసే ధ్వనితో ఆకాశంలో ఏదో పెద్దపక్షి.

ఆ చప్పుడుకు అదిరిపడి ఆ బాలకుడు పిల్లంగ్రోవి ఆపి గభాలున భూమిమీద పడిపోయాడు, ఆ బాలిక దగ్గరిల్లి హోరుమంటూ అతని పక్క వాలి అతన్ని కౌగలించుకొంది.

ఆ రాక్షసిపక్షి వెళ్ళిపోయింది. కొంతసేపటికి ఆపసికందు లిద్దరూ లేచి తమచుట్టూ అంతా కళ్ళనీళ్ళతో పొఱచూచారు.

ఆతని ఆవులు గేదెలు నిశ్చలంగా మేస్తున్నాయి పువ్వులు వికసించి ఉన్నాయి, వేపచెట్టు ఆవరించే ఉన్నది. సెలయేరు జల జల ప్రవహిస్తూ ఉన్నది.

ఆతడు ధైర్యవహించి పిల్లంగ్రోవి తీసి మళ్ళీ మూడు పవిత్రస్వరాలు కలిపాడు. ఏమాశ్చర్యం అన్నట్టుగా ఒక్క మూర్ఛన వచ్చింది. ఆ బాలిక ఆతన్ని కౌగిలించుకునే ఉంది.

దూరంగా యూరపులో యుద్ధం జరుగుతున్నది. జపాను పెరల్ హార్బరుపై విరుచుకు పడింది.

ఆ బాలకుడు అదటుతీరి రోజూ ఆకాశంలో వచ్చిపోయే ఆరాక్షసి పిట్టలమోగ్రతకు శుశ్రుకలిపి ఒక కొత్తమూర్ఛన ప్రయోగించాడు. ఆబాలిక చిరునవ్వుతో అతనిపాట పరవశయై విన్నది.

---

సమాప్తి.